
ఆంధ్రజ్యోతి





కోయంబేడు ప్రత్యేక సంతలో చెరకు గడలు, పసుపు కొమ్ములు

అన్నానగర్ వళ్లియమ్మాళ్ కళాశాలలో సంక్రాంతి సంబరాల్లో సందడి చేస్తున్న విద్యార్థినులు



సంక్రాంతికి సర్వం సిద్ధం

ఎటుచూసినా పండుగ సందడే...

రాష్ట్ర ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సంక్రాంతి, ముక్కనుమ, కానుం పొంగల్ రానే వచ్చాయి. ఆదివారం భోగి పండుగను జరుపుకున్న ప్రజలు సోమవారం సంక్రాంతి, ఆ తదుపరి కానుం పొంగల్ జరుపుకోడానికి సిద్ధమయ్యారు. రైతులు తమకు పొలం పనుల్లో సహకరిస్తున్న పశువులు, ఎద్దులతో కలసి సంక్రాంతి పర్వదినాన సూర్యభగవానుడికి నైవేద్యం పెట్టి, ఈ సంవత్సరమంతా పంటలు పుష్కలంగా పండి దిగుబడి పెరగాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పూజలు చేసి మొక్కులు తీర్చుకోనున్నారు. మరోవైపు యువత ఆటపాటలతో వివిధ రకాల్లో పోటీల్లో పాల్గొని సరదాగా గడిపేందుకు సిద్ధమయ్యారు. ఇదిలా ఉండగా, పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకొనేలా ప్రజలు చెరకు గడలు, మామిడి, అరటి తోరణాలు, పసుపు కొమ్ములు తదితరాలను కొనుగోలు చేశారు. అలాగే, కనుమ రోజున పశువులను అందంగా తీర్చిదిద్దేందుకు రైతులు అలంకరణ సామగ్రిని కూడా సిద్ధం చేసుకున్నారు.

ప్యారీస్, జనవరి 14: రాష్ట్రంలో సంక్రాంతి సందడి మొదలైంది. ప్రజలు భోగి మంటలతో పెద్ద పండుగను ఆదివారం ఘనంగా స్వాగతించారు. ఇక, తమ వారికి ఆహ్వానం పలికేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పల్లెలు సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. పోలీసు శాఖ అనుమతులు లేకున్నా పలు గ్రామాల్లో సంప్రదాయబద్ధంగా కోళ్లపందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. కాగా, నగరాల్లోని బట్టల షాపులు, మిఠాయి దుకాణాలు, మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా ఎద్దులు, రేక్లా పోటీలు నిర్వహించే వేడుకలకు పలు ప్రాంతాల్లో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జల్లికట్టు సంప్రదాయ సాహస క్రీడలకు ప్రసిద్ధిచెందిన మదురై, తేని, పుదుకోట తదితర దక్షిణ జిల్లాల్లో పోటీలకు కోడెలు సిద్ధం చేశారు.

40 నియోజకవర్గాల్లో మనదే గెలుపు

ఇండియా కూటమికి కొత్త సంక్రాంతి ● డీఎంకే శ్రేణులకు స్టాలిన్ లేఖ



చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి ఘన విజయం సాధిస్తుందని డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. సంక్రాంతి సందర్భంగా పార్టీ శ్రేణులకు 'ఎక్స్' పేజీలో ఓ సందేశాన్ని, అదే విధంగా ఓ లేఖ రాశారు. ఈ సంక్రాంతి ఇండియా కూటమికి కొత్త సంక్రాంతి అని, లోక్‌సభ ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించడం తథ్యమని శపథం చేశారు. డీఎంకే ద్రావిడ తరహా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశవ్యాప్తంగా ఖ్యాతి గడిస్తున్నాయని, పార్టీ శ్రేణులంతా ఆ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రత్యర్థులు పనిగట్టుకుని పార్టీలో కలతలు రేపేందుకు పుట్టిస్తున్న వదంతులు పట్టించుకోవద్దని తెలిపారు. సేలంలో జరగనున్న యువజన విభాగం మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర హక్కుల సాధన దిశగా లోక్‌సభ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పాటుపడాలని కోరారు. లోక్ సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో డీఎంకే ఎన్నికల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వారీగా పని చేయడానికి బూత్ ఏజెంట్లను నియమించింది. పోలింగ్ కేంద్రాల ఇన్‌ఛార్జులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులను నియమించింది. తరచూ వీరితో స్టాలిన్ సమావేశమై లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చిస్తున్నారు.. ఇటీవల డీఎంకే సాంకేతిక విభాగం ఇన్‌ఛార్జుల సమావేశాలను కూడా జిల్లాల వారీగా నిర్వహించారు. ఈ సమావేశాల్లో మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు, జిల్లా శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐదు లక్షల మంది...

డీఎంకే యువజన విభాగం మహానాడు సేలంలో ఈ నెల 21న జరగనుంది. ఆ విభాగం కార్యదర్శిగా ఉన్న ఉదయనిధి స్టాలిన్ మంత్రి పదవిని చేపట్టిన తర్వాత జరిగే ఆ మహానాడును భారీ స్థాయిలో నిర్వహించాలని డీఎంకే నిర్ణయించింది. మహానాడుకు సుమారు ఐదు లక్షలమంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. నీట్ నుంచి రాష్ట్రానికి మినహాయింపు పొందటం కోసం డీఎంకే యువజన విభాగం ఇటీవల 50లక్షల సంతకాలు సేకరించే ఉద్యమాన్ని కూడా నిర్వహించింది. ఆ ఉద్యమం ద్వారా సేకరించిన సంతకాలు కలిగిన నివేదికను మహానాడులో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌కు యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి అందించనున్నారు. ఆ తర్వాత ఆ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. ఈ నేపథ్యంలో మహానాడుకు విచ్చేయనున్న పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచేలా స్టాలిన్ ఆదివారం తన 'ఎక్స్' పేజీలో సుదీర్ఘ సందేశం వెలువరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పార్టీ శ్రేణులంతా లోక్‌సభ ఎన్నికలలో డీఎంకే కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఇప్పటి నుండే ప్రచారం సాగించాలన్నారు. మిచౌంగ్ తుఫాను, వర్ష బీభత్సం కారణంగా నష్టపోయిన ఎనిమిది జిల్లాలకు చెందిన ప్రజలను దుకునేలా రూ.6వేల సాయాన్ని అందించామని, అదే విధంగా గృహిణకులకు చెల్లించాల్సిన సాధికారిక నగదు రూ.1000లను నిర్దేశిత తేదీ కంటే ముందుగానే ఈ నెల 10నే వారి బ్యాంక్ ఖాతాలలో జమచేశామని, ఇక సంక్రాంతి సందర్భంగా కానుక వస్తువులతోపాటు రూ.1000ల నగదు కానుకను బియ్యం కార్డు దారులందరికీ పంపిణీ చేశామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయాని, కేంద్రం వరద బాధితులకు నిధులు విడుదల చేయలేకపోయినా తమ ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సంఘటనలు రుజువుచేస్తాయన్నారు.

కేంద్రప్రభుత్వాన్ని గద్దె దింపుదాం...

కేంద్రంలోని బీజేపీ నిరంకుశ ప్రభుత్వాన్ని గద్దె దింపి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని అంటే ఇండియా కూటమి ప్రభుత్వాన్ని నెలకొల్పేందుకు పార్టీ శ్రేణులంతా ఇప్పటి నుంచే పాటుపడాలని స్టాలిన్ కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి అభ్యర్థులు గెలిస్తేనే జాతీయస్థాయిలో మార్పు తీసుకురాగలుగుతామని, రాష్ట్ర హక్కులను సాధించుకోగలుగుతామని స్టాలిన్ పేర్కొన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు...

సంక్రాంతి పండుగ సందర్భంగా పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలుపుతూ స్టాలిన్ లేఖ రాశారు. ఆ లేఖలో రాష్ట్రంలో ద్రావిడ తరహా డీఎంకే ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ప్రత్యేకించి మహిళాభ్యుదయం కోసం అమలు చేస్తున్న పథకాలపై పార్టీ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. గత రెండున్నర సంవత్సరాలుగా ఆర్థిక ఒడిదిడుకులు ఎదురైనా ప్రజలకు ఏ లోటు రానీయకుండా ఆదుకున్నామనే విషయాన్ని వివరించాలన్నారు. రాష్ట్ర హక్కుల సాధనే అందరి లక్ష్యంగా సేలంలో జరిగే డీఎంకే యువజన మహానాడును భారీ స్థాయిలో నిర్వహించనున్నారని, ఆ మహానాడును విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. ప్రతి సంక్రాంతి రోజున పార్టీ శ్రేణులంతా తనను కలుసుకుని కానుకలిచ్చి శుభాకాంక్షలు తెలపటం ఆనవాయితీ ఉండదేని, ఈయేడాదిపార్టీశ్రేణులే కాకుండా ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు వారి స్వొంత నియోజకవర్గాలలో ప్రజల నడుమ పండగను జరుపుకుంటూ డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ సంక్రాంతి దేశ ప్రజల జీవితాలలో కొత్త వెలుగులు నింపడం ఖాయమని స్టాలిన్ పేర్కొన్నారు.





మీనంబాక్కం రహదారిపై పొగమంచు - గిండీ ఫ్లైఓవర్‌పై లైట్లు వేసుకుని వెళుతున్న వాహనచోదకులు

చెన్నైని కప్పేసిన పొగమంచు

భోగి మంటలతో పెరిగిన కాలుష్యం ● విమాన సేవలకు అంతరాయం

చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహితంగా భోగి మంటలు వేయాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు పదే పదే పిలుపునిచ్చినా చెన్నైవాసులు పట్టించుకోలేదు. ఆదివారం వేకువజామునే నగరమంతటా భోగి మంటలు వేశారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను, పాత టైర్లను కాల్చి వాయుకాలుష్యాన్ని విపరీతంగా పెంచారు. ఇళ్లలో పనికిరాని పాత పరికరాలు, విరిగిన కొయ్య వస్తువులను మంటల్లో వేసి భోగి పండుగను జరుపుకోవటం ఆనవాయితీ. అయితే ఇటీవల నగరాల్లో భోగి మంటలు అధికంగా ఉండేలా పాత టైర్లు, ట్యూబులను కాల్చడం అధికమైంది. దీంతో మంచుకు వాయు కాలుష్యం తోడైంది. ఈ కారణంగా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆదివారం వేకువజాము మూడు గంటల నుంచి నగరంలోని రాయపేట, ట్రిప్లికేన్, మైలాపూర్, అడయార్, తిరువాన్మియూరు, వేళచ్చేరి, తాంబరం, గిండీ, ఈకాట్టుతాంగళ్, కోయంబేడు, మదురవాయల్, అన్నానగర్, తిరుముల్లైవాయల్, ఆవడి, అంబత్తూరు, తిరువొత్తియూరు, వాషర్‌మెన్‌పేట, కొరుక్కుపేట, తండయార్‌పేట, మనలి తదితర ప్రాంతాల్లో పాత టైర్లు, ట్యూబ్‌లను కాల్చడంతో నగరమంతటా దట్టమైన పొగలు అలముకున్నాయి. దీంతో నగరవాసులకు ఊపిరి పీల్చుకోవడం కష్టమైంది. ఉదయం 6 గంటల నుంచి 8 వరకు నగరంలో రహదారులు సైతం తెలియనంతగా దట్టమై పొగలు అలముకున్నాయి. ప్రధాన రహదారుల్లో వాహనాలన్నీ లైట్లు వేసుకుని వెళ్లిప్పటికీ దారి సక్రమంగా కనిపించక వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. సబర్బన్ ప్రాంతాలైన మనలి, రెడ్‌హిల్స్ ప్రాంతాల్లోనూ దట్టమైన పొగ వ్యాపించింది. సబర్బన్ రైళ్లు వెళ్లే మార్గాలపై కూడా పొంగ మంచు దట్టంగా అలముకుంది. దీనితో రైలింజన్ డ్రైవర్లు సైతం రైళ్లను అప్రమత్తంగా నడపాల్సి వచ్చింది. ఇక పెరుంగుడి ప్రాంతంలో భోగిమంటల నుంచి వెలువడిన పొగల వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇదే విధంగా మనలి, ఎన్నూరు ప్రాంతాల్లోనూ రహదారులు, ఎదుట వచ్చే మనుషులు కనిపించనంతగా పొగ అలముకుంది. అరుంబాక్కం, రాయపురం ప్రాంతాల్లో పొగ కారణంగా స్థానికులకు శ్వాసకోశ సమస్యలు ఏర్పడ్డాయి.

విమాన సేవలకు అంతరాయం...

ఇదే విధంగా భోగిమంటల కారణంగా మీనంబాక్కం విమానాశ్రయం చుట్టుపక్కలి ప్రాంతాలను దట్టమైన పొగ, మంచు దుప్పటిలా కప్పేశాయి. ఆదివారం వేకువజాము నుంచే కౌల్‌బజార్, పమ్మల్, అనకాపుత్తూరు, మీనంబాక్కం, తర్రైపాక్కం, మనపాక్కం తదితర ప్రాంతాల్లో భోగి మంటలు వేయడంతో ఆ ప్రాంతాల్లో వాయుకాలుష్యం ఏర్పడింది. అన్ని చోట్లా దట్టమైన పొగలు అలముకున్నాయి. ఈ పరిస్థితుల్లో విమానాశ్రయంలోని రన్‌వేలు కనిపించనంతగా పొగ, మంచు కప్పేశాయి. దీంతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆదివారం వేకువజాము 4.35 గంటలకు సింగపూర్ నుంచి 164 మంది ప్రయాణికులతో చెన్నైకి వచ్చిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం, వేకువజాము 5.45 గంటలకు 260 మంది ప్రయాణికులతో వచ్చిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం, ఢిల్లీ నుంచి 117 మంది ప్రయాణికులు వేకువజాము 5.20 గంటలకు వచ్చిన విమానం, శ్రీలంక నుంచి వచ్చిన ప్రయాణికుల విమానం ల్యాండింగ్ కాలేకపోయాయి. దీనితో కంట్రోలు రూమ్ అధికారులు ఈ విమానాలను హైదరాబాద్‌కు మళ్లించారు. ఇదే విధంగా మస్కట్, దుబాయ్, కువైట్, ముంబై, హైదరాబాద్, కోల్‌కత్తా, బెంగళూరు నగరాల నుంచి రావాల్సిన 20 విమానాలు, దుబాయ్, మస్కట్, కువైట్, సింగపూర్, లండన్, ముంబై, ఢిల్లీ, అండమాన్, తూత్తుకుడి, మదురై, తిరువనంతపురం, పుణె తదితర నగరాలకు వెళ్లాల్సిన విమానాలు ఉదయం ఎనిమిది గంటల తర్వాతే వరుసగా గమ్యస్థానాలకు వెళ్లాయి. పొగమంచు కారణంగా 44 విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు అధికారులు ప్రకటించారు. ఉదయం 8 గంటల తర్వాత పొగమంచు తగ్గుముఖం పట్టింది. ఆ తర్వాత ఉదయం 9 గంటలకు విమానాల రాకపోకలు సాఫీగా ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు.

రేపటినుంచి వరల్డ్ బుక్ ఎగ్జిబిషన్

పెరంబూర్, జనవరి 14: స్థానిక నందనం చెన్నై ట్రేడ్ సెంటర్‌లో ఈనెల 16వ తేది నుంచి మూడు రోజులు వరల్డ్ బుక్ ఎగ్జిబిషన్ జరగనుంది. ఈ ఎగ్జిబిషన్‌లో 10 రాష్ట్రాలు, 39 విదేశాలకు చెందిన పబ్లిషర్లు పాల్గొననున్నారు. ప్రతిరోజు సదస్సులు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు, సాయంత్రం భారత్, మలేసియా దేశాలకు చెందిన సంప్రదాయ కళా ప్రదర్శనలు ఉంటాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో పరస్పర ఒప్పందాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా 200తమిళ పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



భారీ ఏర్పాట్లు, కఠిన నిబంధనల నడుమ

నేడు అవనియాపురం జల్లికట్టు

చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తమిళుల ప్రాచీన సాహసక్రీడ జల్లికట్టు పోటీలు నిర్వహించడంలో మొదటి నుంచి మదురై జిల్లానే అగ్రస్థానంలో ఉంది. ముఖ్యంగా అవనియాపురం, పాలమేడు, అలంగానల్లూరులో రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలను వీక్షించడానికి దేశవిదేశాల నుంచి పర్యాటకులు వేలసంఖ్యలో తరలివస్తున్నారు. ఆ మేరకు ఈ యేడాది సంక్రాంతి పండుగల సందర్భంగా ఈనెల 15న సోమవారం అవనియాపురంలో, 16న మంగళవారం పాలమేడులో జల్లికట్టు పోటీలు భారీస్థాయిలో నిర్వహించనున్నారు. ఇక ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అలంగానల్లూరు జల్లికట్టు ఈనెల 17న జరగనుంది. అలంగానల్లూరులో నిర్వహించనున్న జల్లికట్టును రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి ప్రారంభిస్తారు. ఈ మూడు ప్రాంతాల్లో జల్లికట్టు నిర్వహనకు ఇటీవల ముహూర్త స్తంభ స్థాపన కార్యక్రమాలు జరిగాయి. ప్రస్తుతం జల్లికట్టు వాడివాసల్ ప్రాంతాల్లో భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆన్‌లైన్ ద్వారా జల్లికట్టు ఎద్దులను, యువ క్రీడాకారులను ఎంపిక చేయడం పూర్తయ్యింది. ఆ మేరకు రాష్ట్రం నలమూలల నుంచి మొత్తం 12,176 ఎద్దులు, 4513 మంది యువకులు పాల్గొనేందుకు దరఖాస్తులు వచ్చాయి. అవనియాపురంలో 2,400 ఎద్దులు, 1,318 యువ క్రీడాకారులు, పాలమేడులో 3,677 ఎద్దులు, 1,412 క్రీడాకారులు, అలంగానల్లూరులో 6,099 ఎద్దులు, 1,764 క్రీడాకారులు తరఫున దరఖాస్తులు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో అవనియాపురంలో సోమవారం ఉదయం జల్లికట్టు భారీ ఏర్పాట్ల నడుమ ప్రారంభమవుతోంది. జల్లికట్టు వాడివాసల్ (ఎద్దులను వరుసగా విడిచే ప్రాంతం) వద్ద రూ.26.5 లక్షలతో గ్యాలరీలు, బ్యారికేడ్లు, వాడివాసల్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సందర్శకుల గ్యాలరీ, కలెక్షన్ పాయింట్ తదితర ప్రాంతాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇప్పటికే ఆ జిల్లా వాసులంతా ఆ ప్రాంతానికి తరలివెళ్లారు. ఉదయం 8 గంటలకు ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఇదిలా ఉండగా అవనియాపురంలో సోమవారం జరగనున్న జల్లికట్టుకు అధికారులు పలు నిబంధనలు విధించారు.



జల్లికట్టు ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి మూర్తి

టాస్మాక్ దుకాణాలకు సెలవు

మదురై జిల్లాలో సోమవారం నుంచి జల్లికట్టు క్రీడా పోటీలు జరగనుండటంతో మూడు రోజులపాటు టాస్మాక్ మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సంగీత ఆదివారం ప్రకటన జారీ చేశారు. అవనియాపురం, పాలమేడు, అలంగానల్లూరుల్లో వరుసగా జల్లికట్టు జరగనుండటంతో ముందస్తుజాగ్రత్త చర్యల్లో భాగంగా మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు తెలిపారు.

సమాచార దర్శిని

3184 మంది పోలీసులు, సిబ్బందికి పతకాలు

అడయార్, జనవరి 14: పొంగల్ పండుగను పురస్కరించుకుని 3184 మంది యూనిఫాం సర్వీసెస్ సిబ్బందికి సంక్రాంతి పతకాలు అందజేయాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశించారు. ఇదే విషయంపై ప్రభుత్వం ఆదివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర పోలీస్ శాఖ, అగ్నిమాపకదళ విభాగం, జైళ్ల శాఖ, యూనిఫాం సర్వీస్‌తో పాటు పోలీస్ శాఖలోని వివిధ విభాగాలకు చెందిన సిబ్బందికి సంక్రాంతి పతకాలు ప్రదానం చేయాలని సీఎం స్టాలిన్ ఆదేశించారు.

రేపు ఎగ్మూర్ - కొల్లం ప్రత్యేక రైలు

పెరంబూర్, జనవరి 14: శబరిమలైలో మకరజ్యోతి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చెన్నై ఎగ్మూర్ - కొల్లం - చెన్నై ఎగ్మూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. నెం.06031 చెన్నై ఎగ్మూర్ - కొల్లం ప్రత్యేక రైలు ఈనెల 16వ తేది (మంగళవారం) ఎగ్మూర్ నుంచి రాత్రి 11.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 5 గంటలకు కొల్లం చేరుకుంటుంది. అలాగే, నెం.06032 కొల్లం - చెన్నై ఎగ్మూర్ ప్రత్యేక రైలు ఈ నెల 16వ తేది కొల్లం నుంచి వేకువజామున 3 గంటలకు బయల్దేరి రాత్రి 9 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లకు ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైందని అధికారులు తెలిపారు.

19న 'అంతర్జాతీయ వైద్య మహానాడు'

పెరంబూర్, జనవరి 14: స్థానిక నందనంలోని చెన్నై ట్రేడ్ సెంటర్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేది వరకు 'అంతర్జాతీయ వైద్య మహానాడు' జరగనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రప్రభుత్వం, ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం సంయుక్తంగా 'భవిష్యత్తు వైద్యం' పేరుతో నిర్వహించనున్న ఈ మహానాడులో పలు దేశాలకు చెందిన వైద్య నిపుణులు, యూజీ, పీజీ ప్రొఫెసర్లు హాజరుకానున్నారు. మహానాడు ప్రాంగణంలో వివిధ శస్త్రచికిత్సలకు సంబంధించిన విషయాలు, సూచనలు, సలహాలు అందించేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రజలు వీక్షించవచ్చని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

17 వరకు ఆదివారం టైంటేబుల్

పెరంబూర్, జనవరి 14: సంక్రాంతి సెలవుల సందర్భంగా ఈనెల 15న సోమవారం నుంచి 17వ తేది వరకు ఆదివారం టైం టేబుల్ ప్రకారం మెట్రోరైళ్లు నడుస్తాయి. సెలవుల సందర్భంగా ఉదయం 5నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైళ్లు నడుస్తాయని సీఎంఆర్ఎల్ తెలిపింది. ఉదయం 5నుంచి మధ్యాహ్నం 12గంటలు, రాత్రి 8నుంచి 10 గంటల వరకు ప్రతి 10 నిమిషాలకు ఒక రైలు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8 గంటల వరకు 7 నిమిషాలకు ఒక రైలు నడుపనున్నారు. ఇక, రాత్రి 10 నుంచి 11 గంటల వరకు 15 నిమిషాలకు ఒక రైలు నడుస్తుంది.

కరుప్పన్ స్వామికి 18 అడుగుల పొడవు ఖడ్గం

అడయార్, జనవరి 14: మదురై జిల్లా అళగర్ ఆలయంలోని కరుప్పన్ స్వామికి వైద్య దంపతులు 18 అడుగుల పొడవు ఖడ్గాన్ని బహూకరించారు. ఈ జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాల్లో అళగర్ ఆలయం ఒకటి. ఇక్కడకు ప్రతి నిత్యం వేలాదిమంది భక్తులు వస్తుంటారు. అలాంటి భక్తుల్లో మదురైకు చెందిన వైద్య దంపతులు 18 అడుగుల పొడవు ఉండే ఖడ్గాన్ని బహూకరించి మొక్కు చెల్లించుకున్నారు. ఈ భారీ ఖడ్గాన్ని భక్తులంతా చూసేందుకు వీలుగా ఆలయ ప్రాంగణంలో ఉంచారు.

కర్ణాటకనుంచి అందని 90 టీఎంసీల కావేరి జలాలు

పెరంబూర్, జనవరి 14: కర్ణాటక నుంచి 90 టీఎంసీల కావేరిజలాలు విడుదల చేయకపోవడంతో, పలు జిల్లాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశముంది. రాష్ట్రానికి యేటా 177.25 టీఎంసీల కావేరి జలాలు కర్ణాటక ప్రభుత్వం అందించాల్సి ఉంది. ప్రతి నెలా అందించాల్సి నీటి పర్యవేక్షణకు కావేరి నిర్వాహక మండలి ఏర్పాటైంది. ఈ మేరకు ప్రతి ఏడాది జూన్ నుంచి కావేరి జలాల విడుదల లెక్కిస్తుంటారు. ఈ నేపథ్యంలో, జూన్‌లో 9.19 టీఎంసీలకు గాను 2.83 టీఎంసీలు, జూలైలో 31.24 టీఎంసీలకు గాను 8.74 టీఎంసీలు, ఆగస్టులో 45.9టీఎంసీలకుగాను 19.99 టీఎంసీలు సరఫరా చేసింది. అలాగే, సెప్టెంబరులో 36.7 టీఎంసీలకు విడుదల చేయాల్సి ఉండగా 13.5 టీఎంసీలు, అక్టోబరులో 20.22 టీఎంసీలకు గాను 12.8 టీఎంసీలు, నవంబరులో 13.7 టీఎంసీలకు గాను 10.6 టీఎంసీలు, డిసెంబరులో 7.35 టీఎంసీలకు గాను 5.44 టీఎంసీలు వదిలింది. ఆరు నెలల కాలంలో 156 టీఎంసీలు అందించాల్సి ఉండగా 74.9 టీఎంసీల నీరు మాత్రమే కర్ణాటక విడుదల చేసింది. 90 టీఎంసీల నీరు విడుదల చేయకపోవడంతో నామక్కల్, కరూర్, ఈరోడ్ సహా పలు జిల్లాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశముందని జలవనరుల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

'చెన్నై సంగమం' జరిగే ప్రాంతాలివే

పెరంబూర్, జనవరి 14: సంక్రాంతి సందర్భంగా నగరవాసులకు గ్రామీణ కళారూపాలు పరిచయం చేసేలా 'చెన్నై సంగమం' పేరుతో ప్రత్యేక సాంస్కృతిక కళా ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఈ ప్రదర్శనలను ఐలాండ్ గ్రౌండ్స్‌లో శనివారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఆదివారం నుంచి 17వ తేది వరకు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటలకు జరగనున్నాయి. ప్రదర్శనలు జరిగే ప్రాంతాలను సచివాలయం విడుదల చేసింది. ఐల్యాండ్ గ్రౌండ్స్, కొళత్తూర్- కార్పొరేషన్ క్రీడా మైదానం, పెరంబూర్- మురసొలిమారన్ ఫ్లై ఓవర్ పార్కు, రాయపురం- రాఫిల్‌సన్ క్రీడా మైదానం, మైలాపూర్- నాగేశ్వరరావు పార్కు, సెమ్మొళి పార్క్, నుంగంబాక్కం- కార్పొరేషన్ క్రీడా మైదానం, ట్రిప్లికేన్- భారతసారన్ శరణియార్ మైదానం, టి.నగర్- నటేశన్ పార్కు ఎదురుగా ఉన్న కార్పొరేషన్ క్రీడా మైదానం, బిసెంట్ నగర్- ఎలియట్స్ బీచ్, తిరువాన్మియూర్ బీచ్, సైదాపేట- కార్పొరేషన్ బాలుర మహోన్నత పాఠశాల ప్రాంగణం, కేకే నగర్- శివన్ పార్కు, వలసరవాక్కం- పళనియప్ప నగర్, లేమెక్స్ పాఠశాల ప్రాంగణం, అన్నానగర్- టవర్ పార్కు, కోయంబేడు- జయనగర్ పార్కు, అంబత్తూర్- ఎస్వీ క్రీడా మైదానం, ఎగ్మూర్- ప్రభుత్వ మ్యూజియం ప్రాంతాల్లో ఈ ప్రదర్శనలు జరుగుతాయి.

మద్యం బాటిల్ తిరిగి ఇస్తే రూ.10

19నుంచి ఐదు జిల్లాల్లో అమలు

పెరంబూర్, జనవరి 14: ఖాళీ మద్యం బాటిళ్లను టాస్మాక్ సంస్థ తిరిగి తీసుకొనే పథకం ఐదు జిల్లాల్లో ఈనెల 19వ తేది నుంచి అమలుకానుంది. పర్యాటక ప్రాంతాలైన ఊటీ, కొడైకెనాల్, కోయంబత్తూర్ జిల్లాల్లోని మద్యం దుకాణాల్లో టాస్మాక్ సంస్థ బాటిళ్లను తిరిగి తీసుకొని, ఒక్కో బాటిల్‌కు రూ.10 అందజేస్తోంది. ఈ పథకం ఈనెల 19వ తేది నుంచి తేని, కన్నియాకుమారి, ధర్మపురి, నాగపట్టినం, తిరువారూర్ తదితర ఐదు జిల్లాల్లో అమలు చేయనున్నారు. ఈ విషయమై టాస్మాక్ అధికారిమాట్లాడుతూ... మద్యం విక్రయించే సమయంలో ఒక్కో బాటిల్‌కు అదనంగా రూ.10 వసూలు చేస్తామని, ఆ ఖాళీ బాటిల్ దుకాణంలో తిరిగి అందిస్తే రూ.10 తిరిగి చెల్లిస్తామని తెలిపారు.

తిరుచెందూరు ఆలయానికి పోటెత్తిన భక్తులు

చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో ద్వితీయ క్షేత్రంగా కీర్తింపబడుతున్న తిరుచెందూరు సెంథిల్ ఆండవర్‌ను దర్శించేందుకు ఆదివారం ఉదయం రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో విపరీతమైన రద్దీ ఏర్పడింది. మురుగన్ దర్శించి తై పొంగల్ వేడుకలను జరుపుకోవడం తమిళుల ఆనవాయితీ. ఆ మేరకు సోమవారం పొంగల్ పండుగను జరుపుకోవడానికి ముందుగా తిరుచెందూరు క్షేత్రానికి అన్ని జిల్లాల నుంచి భక్తులు పోటెత్తారు. గత కొద్ది రోజులుగా తూత్తుకుడి, తిరునల్వేలి, విరుదునగర్, తెన్‌కాశి తదితర జిల్లాల నుంచి లక్షలాదిమంది భక్తులు విచ్చేసి తిరుచెందూరు ఆండవర్‌ను దర్శించి వెళుతున్నారు. సమీప జిల్లాల నుంచి పాదయాత్రగాను భక్తులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం భోగి పండుగ సందర్భంగా తిరుచెందూరు స్వామివారిని దర్శనం చేయడానికి వేలాదిమంది భక్తులు క్యూలో బారులు తీరారు. వేకువజామునే వచ్చిన భక్తులందరూ సముద్రతీరంలోను, నాళికినరు తీర్థంలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల్లో చాలామంది నోటికి శూలాలు గుచ్చుకుని, కావళ్లు మోస్తూ ఆలయానికి విచ్చేశారు. ఇక బాలబాలికలుకులు సాధువుల వేషధారణతో ఆడుతూపాడుతూ ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఇక సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తిరుచెందూరు ఆలయాన్ని వేకువ జామున 1గంటకే తెరిచి, 1.30 గంటలకు విశ్వరూప దర్శనం కల్పించనున్నారు. ఆ తర్వాత వేకువజాము 2 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, ఆ తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో సుమారు రెండు వందల మంది పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.



తిరుచెందూరు తీరం వద్ద భక్తజనసంద్రం

ఉత్సాహంగా భోగి

ప్యారీస్, జనవరి 14: రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు భోగి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే భోగి మంటలతో సంక్రాంతి పండుగను ఆహ్వానించారు. ఇళ్ల లోగిళ్లలో విభిన్న రంగులతో రంగవల్లికలు వేసి గొబ్బెమ్మలను అందంగా తీర్చిదిద్దారు. ఇక, చిన్నారులు చలినిలెక్కచేయకుండా వీధుల్లో తిరుగుతూ డప్పులతో సందడి చేశారు. పల్లెల్లో పిడకలు, తాటాకులు, పాత బట్టలు, కర్రపుల్లలను భోగి మంటల్లో వేసి భోగి... భోగి అంటూ కేరింతలు కొట్టారు. నగరాల్లో కూడా ఉత్సాహంగా, ఉల్లాసంగా భోగి వేడుకల్లో పాల్గొన్నారు. భోగి రోజున చిన్నారుల తలపై వారి తల్లిదండ్రులు, బంధువులు, ముత్తయిదువులు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.



భోగి మంటల ముందు డప్పులతో చిన్నారుల సందడి

బీచ్‌లలో తీరం పొడవునా కంచె

● వేల సంఖ్యలో పోలీసుల పహారా

అడయార్, జనవరి 14: సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఈనెల 17న కానుం పొంగల్ వేడుక జరుపుకోనున్నారు. ఈ పండగను పురస్కరించుకుని నగరవాసులు తమ కుటుంబ సభ్యులతో బీచ్‌లు, ఇతర పర్యాటక ప్రాంతాలకు వెళ్తుంటారు. ముఖ్యంగా బీచ్‌కు వచ్చే పర్యాటకులను క్రమబద్ధీకరించేందుకు వీలుగా పోలీసులు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 3 కిలోమీటర్ల దూరం వరకు కొయ్యలతో బ్యారికేడ్లను నిర్మిస్తున్నారు. బీచ్‌కు వచ్చే పర్యాటకులు సముద్రంలో స్నానం చేయకుండా ఉండేందుకు వీలుగా వాటిని ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, తీర ప్రాంతంలో 50కు పైగా ప్రాంతాల్లో నిఘా కెమెరాలను అమర్చారు. చోరీలు, దారిదోపిడీలు వంటి నేరాలను అడ్డుకునేందుకు వీటిని ఏర్పాటు చేశారు. మెరీనా తీరంతో పాటు ఎలియట్స్ బీచ్‌లో సీసీ కెమెరాల తో వాచ్ టవర్లను నిర్మించారు. చిన్నారులతో కలిసి బీచ్‌కు వచ్చే తల్లిదండ్రులు పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని కోరారు. పిల్లలకు గుర్తింపు కార్డులను వారి ప్యాకెట్లలో ఉంచాలని కోరారు. అదేవిధంగా నగరంలోని ఇతర పర్యాటక ప్రాంతాల్లో కూడా ఇదే తరహా భద్రతా ఏర్పాట్లు చేశారు. కనుమ పండుగ రోజున నగరంలోని పర్యాటక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వేల సంఖ్యలో పోలీసు బలగాలను వినియోగించి భద్రతను కల్పించనున్నారు.



మెరీనాబీచ్ వద్ద కొయ్యలతో కంచెను నిర్మిస్తున్న కార్మికులు

20న రిషివందియంలో డీఎండీకే నిరాహారదీక్ష

ప్రేమలత ప్రకటన



సాలిగ్రామంలోని విజయకాంత్ నివాసానికి వెళ్లి ఆయన సతీమణి ప్రేమలతను పరామర్శిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రామ్మోహనరావు, విల్లివాక్కం సురేష్ తదితరులు

ప్యారీస్, జనవరి 14: ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లను తొలగించిన ప్రభుత్వ అధికారుల తీరును ఖండిస్తూ కళ్లకురిచ్చి నియోజకవర్గం పరిధిలోని రిషివందియంలో ఈనెల 20న నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలతా విజయకాంత్ ప్రకటించారు. ఆదివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రావు, విల్లివాక్కం సురేష్ తదితరులు సాలిగ్రామంలోని విజయకాంత్ గృహానికి వెళ్లారు. విజయకాంత్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి ప్రేమలతను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రేమలత మాట్లాడుతూ... తనను పరామర్శించిన రాజకీయ నేతలు, సినీ కళాకారులు ఇతర ప్రముఖులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. రిషివందియం నియోజకవర్గం విజయకాంత్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లను తొలగించిన అధికారుల తీరును ఖండిస్తూ ఈనెల 20న నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలిపారు.

అధిష్ఠానం ఆదేశిస్తే ఎన్నికల్లో పోటీ

ఎండీఎంకే ముఖ్య కార్యదర్శి దురై వైగో



చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే, కార్యకర్తలు ఒత్తిడి చేస్తే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయక తప్పదని ఎండీఎంకే ముఖ్య కార్యదర్శి దురై వైగో అన్నారు. మదురై యానైమలైలో ఆదివారం జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఎన్నికల్లో పోటీ చేయకుండా పార్టీ అభివృద్ధి పాటుపడాలన్నదే తన ఆశయమన్నారు. అదే సమయంలో అధిష్ఠానం ఆదేశిస్తే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తానని చెప్పారు. ఢిల్లీ స్థాయిలో ఎంపీగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ఆయన తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 28న త్యాగరాజ ఆరాధన

చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 28న శ్రీత్యాగరాజ ఆరాధన నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్థానిక టీనగర్ ఆంధ్రా క్లబ్ గోదావరి హాలులో 28 సాయంత్రం 6.30 గంటలకు నిర్వహించే శ్రీత్యాగరాజ ఆరాధన సందర్భంగా విదుషీమణి కమలికుమార్ బృందం పంచరత్న కీర్తనలను ఆలాపించనున్నారని పేర్కొన్నారు. సుప్రసిద్ధ వయొలిన్ విద్వాంసురాలు పద్మశ్రీ అవసరాల కన్యాకుమారికి ఆత్మీయ సత్కారం చేయనున్నామని తెలిపారు.

కోవైలో వన్యమృగాల చికిత్సా కేంద్రం

పెరంబూర్, జనవరి 14: కోయంబత్తూర్ అటవీ రేంజ్ పరిధిలోని పేత్తికుట్టలో రూ.19.50 కోట్లతో వన్యమృగాల చికిత్స, పునరావాస కేంద్రం ఏర్పాటుకానుంది. రాష్ట్రంలో వన్యమృగాల సంరక్షణకు రాష్ట్రప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ చర్యల్లో భాగంగా 131 ఎకరాల విస్తీర్ణం కలిగిన సిరుముగై సమీపంలోని మేట్టూరు - పేత్తికుట్ట ఈ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు అటవీ శాఖ కార్యదర్శి సుప్రియ సాహు జీవో విడుదల చేశారు.

స్థిరంగా మేట్టూరు డ్యాం నీటిమట్టం

పెరంబూర్, జనవరి 14: సేలం జిల్లా మేట్టూరు డ్యాం నీటిమట్టం 71.10 ఘనపుటడుగులుగా ఉంది. డ్యాం పరీవాహక ప్రాంతాల నుంచి 659 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతుండగా, తాగునీటి అవసరాలకు 600 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పుదుచ్చేరి సీటు కోసం పట్టుబడుతాం!

డీఎంకే నేత శివ



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న డీఎంకే నేత శివ ఇతర ప్రముఖులు

చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గాన్ని డీఎంకేకు కేటాయించాలని పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి చేయనున్నట్లు ఆ రాష్ట్రానికి చెందిన డీఎంకే నాయకుడు శివ తెలిపారు. డీఎంకే రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఊచుడు నియోజకవర్గం పిళ్లయార్‌కుప్పంలో ఆదివారం ఉదయం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న శివ విలేకరులతో మాట్లాడుతూ... పుదుచ్చేరి సీటును మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు కేటాయించడం ఆనవాయితీగా ఉంటోందని, అయితే డీఎంకే తరఫున పోటీ చేయకపోవడం వల్ల కార్యకర్తల్లో నిరుత్సాహం అధికమవుతోందని చెప్పారు. ఈ పరిస్థితులలో ఈ సారి పుదుచ్చేరి లోక్‌సభ స్థానాన్ని డీఎంకేకు కేటాయిస్తే అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిచే అవకాశం ఉందని చెప్పారు. ఈ విషయమై పార్టీ అధిష్ఠానం తగు నిర్ణయం తీసుకుంటుందనే తాము భావిస్తున్నామని శివ చెప్పారు.

రాష్ట్రంలో ద్విభాషా విధానమే

అన్నామలైకి బదులిచ్చిన ప్రభుత్వం

చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్రిభాషా విద్యావిధానానికి తావులేదని, ద్విభాషా విద్యావిధానమే కొనసాగుతుందని స్పష్టం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం సాయంత్రం ఓ ప్రకటన జారీ చేసింది. రాష్ట్రంలో త్రిభాషా విద్యావిధానాన్ని అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ఆయన పార్టీ సమావేశాల్లోనూ ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేస్తూ ద్విభాషా విద్యావిధానమే కొనసాగుతుందని ఆయనకు బదులిచ్చింది.

వన్యమృగాల దాడి మృతులకు రూ.10 లక్షల పరిహారం

పెరంబూర్, జనవరి 14: వన్యమృగాల దాడిలో మృతి చెందిన వారికి అందించే పరిహారాన్ని పెంచుతూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... 2021లో ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం, వన్యమృగాల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి అందిస్తున్న పరిహారాన్ని రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచింది. తాజాగా, ఈ పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ జీవో విడుదల చేసినట్లు ప్రభుత్వం తెలిపింది.

డీఎంకే యువజన మహానాడు ఏర్పాట్లు ముమ్మరం

మంత్రి ఎస్ ముత్తుసామి

ప్యారీస్, జనవరి 14: సేలం పెద్దనాయకన్ పాళయంలో ఈనెల 21న నిర్వహించనున్న డీఎంకే యువజన విభాగం ద్వితీయ మహానాడుకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు మంత్రి ఎస్.ముత్తుసామి తెలిపారు. ఆదివారం ఉదయం ఆయన పార్టీ నాయకులతో, ఎంపీలతో కలిసి మహానాడు ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఈ మహానాడుకు రాష్ట్రం నలుమూలల నుంచి ఐదు లక్షలమందికి పైగా కార్యకర్తలు పాల్గొంటారని, ముఖ్యమంత్రి స్టాలిన్ సహా, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, తదితర ప్రముఖులు హాజరవుతున్న కారణంగా సుమారు ఎనిమిది వేల మంది పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. వేదిక ప్రాంగణాన్ని సేలం డీఎస్పీ అరుణ్ కపిలన్ నేతృత్వంలోని పోలీసు అధికారులు ప్రతిరోజూ పరిశీలిస్తున్నారని మంత్రి వివరించారు. వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంట్రోలు రూంను నిర్వహించే బాధ్యతలను చెన్నైపోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ లావణ్యకు అప్పగించామన్నారు. ప్రస్తుతం ఆమె సేలంలో బసచేస్తూ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నారని చెప్పారు. ఈ మహానాడులో పాల్గొనే నిమిత్తం సీఎం స్టాలిన్ ఈనెల 20వ తేదీ సాయంత్రం చెన్నై నుంచి విమానంలో బయలుదేరి సేలంకు విచ్చేయనున్నారని, ఆయనకు పార్టీ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు సౌకర్యార్థం వేదిక ప్రాంగణం వద్ద తాగునీరు, భోజన, తాత్కాలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.



మహానాడు ప్రాంతం వద్ద వేదిక నిర్మాణ పనులను పార్టీ ప్రముఖులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి ఎస్. ముత్తుసామి



చెన్నై టి.నగర్ టీటీడీ ఆలయంలో శ్రీరామజన్మభూమి క్షేత్ర ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో ఆదివారం సాయంత్రం గాత్ర కచేరీ చేసిన సెరుగుడి సిస్టర్స్, శ్రుతిభట్‌ను సత్కరిస్తున్న స్థానిక సలహామండలి సభ్యులు

కిటకిటలాడిన కోయంబేడు మార్కెట్

రూ.3700 పలికిన కిలో మల్లె పూలు



అడయార్, జనవరి 14: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోయంబేడు మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. పొంగల్ పండుగను పురస్కరించుకుని కోయంబేడు మార్కెట్‌లో ప్రత్యేకసంతను ఈనెల 11వతేదీన ఏర్పాటు చేశారు. ఈ సంతలోనే సంక్రాంతి పండుగకు కావాల్సిన అన్ని రకాల సరకులు లభ్యమయ్యేలా కోయంబేడు వ్యాపారులు చర్యలు తీసుకున్నారు. అయితే, సంక్రాంతి పండుగ సందర్భంగా ఈమార్కెట్‌లో లభ్యమయ్యే అన్నిరకాల వస్తుసామగ్రి ధరలు ఆకాశాన్ని తాకాయి. ముఖ్యంగా ఈ మార్కెట్‌లో పూల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. నేడు సంక్రాంతి కావడంతో కిలో మల్లెపూలు రూ.3700గా పలికింది. అలాగే, అడవి మల్లి ధర రూ.2700గా ఉంది. జాజి మల్లి ధర రూ.1500, ముల్లై పూలు రూ.1800, కనకాంబరాలు రూ.1200, అరలి పూల ధర రూ.300, చామంతి రూ.150 చొప్పున విక్రయించారు.

రెండు రోజుల్లో 4.34 లక్షలమంది స్వస్థలాలకు పయనం

రవాణా శాఖ మంత్రి శివశంకర్



చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర రవాణా సంస్థ ఆధ్వర్యంలో మునుపెన్నడూ లేనంతగా అత్యధికంగా బస్సులు నడిపామని, రెండు రోజుల్లో 4.34 లక్షల మంది స్వస్థలాలకు పయనమయ్యారని రవాణా శాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్ తెలిపారు. రాష్ట్ర రవాణా సంస్థల్లో 20,084 బస్సులున్నాయని, వీటిలో సిటీ బస్సులు 9620 బస్సులని చెప్పారు. ఈ బస్సులకుతోడుగా 1361బస్సులను చేర్చి రెండు రోజులుగా నగరం నుంచి దక్షిణాది నగరాలకు, అదే విధంగా వివిధ నగరాలకు 10వేల బస్సులను నడిపామని ఆయనచెప్పారు. శనివారం 1.44లక్షల మంది ప్రయాణికులు రవాణా సంస్థ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారని తెలిపారు. గత ఏడాదికంటే ఈ యేడాది సంక్రాంతికి 23 వేలమంది అధికంగా రిజర్వు చేసుకున్నారని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా రవాణా సంస్థ అధికారులు ఎప్పటికప్పుడు బస్‌స్టేషన్లలో బస్సుల రాకపోకలపై పరిశీలనలు, తనిఖీలు జరుపుతున్నారని చెప్పారు.

నాగై ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు వర్గాల ఘర్షణ

అడయార్, జనవరి 14: నాగపట్టినం జిల్లా కేంద్రంలో రెండు వర్గాలకు చెందిన యువకులు భౌతికంగా దాడి చేసుకున్నారు. ఈ దాడిలో పలువురికి గాయాలయ్యాయి. అలాగే, ఆస్పత్రిలో ఉన్న అనేక వైద్య ఉపకరణాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఆస్పత్రిలో గొడవకు దిగిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో భారీగా పోలీసులు మోహరించారు. ఈ దాడికి పాల్పడిన వారిని నాగపట్టినం జిల్లా సెల్లూరుకు చెందిన ప్రవీణ్ (38), సంజయ్ (32)గా గుర్తించి అరెస్టు చేశారు.

ప్లాస్టిక్ గోదాములో అగ్నిప్రమాదం : ఉత్తరాది కార్మికుడి మృతి

ప్యారీస్, జనవరి 14:స్థానిక రెడ్‌హిల్స్ సమీపంలోని పెరుంబాక్కంలో ఉన్న ప్లాస్టిక్‌గోదాములో ఆదివారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో మంటల్లో చిక్కుకొని ఉత్తరాదికి చెందిన ఓ కార్మికుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పులియాంతోపుకు చెందిన జమాలుద్దీన్ పెరుంబాక్కంలో పాత ప్లాస్టిక్ రీసైక్లింగ్ కంపెనీ నడుపుతున్నారు. అక్కడ ఉత్తరాదికి చెందిన 10మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 2గంటలకు ఆ గోదాము నుంచి మంటలు చెలరేగాయి. దీంతో విధుల్లోఉన్న కార్మికులు బయటకు పరుగులు తీశారు. అయితే, బిహార్‌కుచెందిన మిత్రదాస్ (27)బయటకు వెళ్లేందుకు యత్నిస్తూ మంటల్లో చిక్కుకొని అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మనలి ప్రాంతానికి చెందిన అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో అక్కడకు వెళ్లి సుమారు గంట శ్రమించి మంటలు అదుపుచేశారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

రెండు లారీల ఢీ: ఐదుగురికి గాయాలు

ప్యారీస్, జనవరి 14: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సమీపంలోని చెన్నై - తిరుపతి జాతీయ రహదారిలో దట్టంగా అలుముకున్న పొగమంచులో రెండు లారీలు ఢీకొనడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి తిరుత్తణి ప్రాంతప్రజలు భోగి పండుగ సందర్భంగా మంటలు రాజేశారు. అందువల్ల ఆ ప్రాంతంలో మంచుతోపాటు పొగ దట్టంగా వ్యాపించింది. దీంతో వాహనచోదకులు దారి స్పష్టంగా తెలియకపోవడంతో ఇబ్బంది పడ్డారు. ఆ సమయంలో కోయంబేడు సంత నుంచి చెరకు, పసుపు కొమ్ములు, కూరగాయల లోడుతో బయల్దేరిన లారీని సూర్య నడపగా, అందులో వల్లియమ్మాళ్, జైలా అనేమహిళా వ్యాపారులు ప్రయాణించారు. ఆ లారీ కేజీ కండిగవైపు వెళుతున్న సమయంలో ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఆంధ్ర రాష్ట్రం నుంచి కొబ్బరి బోండాల లోడుతో వచ్చిన లారీ ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన ఐదుగురిని మూడు అంబులెన్స్‌ల ద్వారా తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విద్య కోసం భూదానం: మదురై ఆయి అమ్మాళ్‌కు అవార్డు

సీఎం స్టాలిన్ ప్రకటన



ఆయి అమ్మాళ్

చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): మదురైలో ప్రభుత్వ పాఠశాల కోసం భూమిని దానంగా ఇచ్చిన ఆయి అమ్మాళ్‌ను ప్రత్యేక అవార్డుతో ఘనంగా సత్కరించనున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం తన 'ఎక్స్' పేజీలో సందేశం వెలువరించారు. ఇటీవల ఆయి అమ్మాళ్ అలియాస్ పూర్ణమ్ అనే వృద్ధురాలు తనకు చెందిన 1.52 ఎకరాల భూమిని ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదులు నిర్మించేందుకు విరాళంగా అందజేశారనే సంగతి తెలుసుకుని సంతోషించానని, ఆమె దాతృత్వానికి సాటిలేదని కొనియాడారు. ఈ నేపథ్యంలో ఈ నెల 26న రిపబ్లిక్ వేడుకల్లో ఆయి అమ్మాళ్‌ను ప్రత్యేక అవార్డుతో సత్కరించనున్నామని స్టాలిన్ ఆ సందేశంలో తెలిపారు.

సామాజిక సేవలో ముందుకు సాగండి


ఎంసీటీబీసీ కాపరి రాజేంద్రప్రసాద్

ప్యారీస్, జనవరి 14: దైవసేవతో పాటు సామాజిక సేవలో కూడా ముందుకు సాగాలని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి (ఎంసీటీబీసీ) కాపరి రెవరెండ్ ఎస్.రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఇటీవల సమావేశం ఆఫ్ తెలుగు బాప్టిస్టు చర్చెస్ యాజమాన్యం ఆమోస్, ఎస్.సురేష్‌ను రెవరెండ్లుగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం స్థానిక వెప్పేరిలోని సంఘ ప్రాంగణంలో వారిని ఘనంగా సత్కరించారు. కార్యదర్శి పోతల ప్రభుదాస్, అధ్యక్షుడు జి.రామయ్య, ట్రెజర్ అనుమలగుర్తి బాబు, సంఘ నిర్వాహకులు, వివిధ కమిటీల సభ్యులు పాల్గొని సన్మానగ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.



రెవరెండ్ ఆమోస్, సురేష్‌తో రెవరెండ్ రాజేంద్రప్రసాద్, పోతల ప్రభుదాస్ తదితరులు

వరుస ప్రాజెక్టులతో జోరుమీదున్న కమల్


కమల హాసన్

విశ్వనటుడు కమల హాసన్ వరుస ప్రాజెక్టులు ప్రకటిస్తూ, జోరుమీదున్నారు. 2022లో యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'విక్రమ్' కమల్‌కు కనకవర్షం కురిపించింది. ఆ తర్వాత ఆయన తన సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానరుపై వరుస ప్రాజెక్టులు ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో గత యేడాది సెప్టెంబరు 5వ తేదీ వినోద్ దర్శకత్వంలో తన కొత్త చిత్రాన్ని ప్రకటించారు. రైతు సమస్యలను వివరించేలా సినిమా ఉంటుందని కోలీవుడ్ వర్గాల సమాచారం. ఆ తర్వాత నవంబరు 6న తన పుట్టిన రోజును పురస్కరించుకుని మణిరత్నం దర్శకత్వంలో 'తగ్ లైఫ్' పేరుతో మరో చిత్రాన్ని ప్రకటించారు. కేవలం రెండు నెలల విరామం తర్వాత తన 237వ చిత్రంపై అధికారిక ప్రకటన చేశారు. ఈ సినిమాకు స్టంట్ మాస్టర్స్ అన్బరివ్‌లు దర్శకత్వం వహిస్తారు. దీనిపై కమల్ ట్వీట్ చేస్తూ... 'ఇద్దరు ప్రతిభావంతులు, వారిలో కొత్త అవతార్‌లో 237 సినిమా చేయనుండటం గర్వంగా ఉంది. మాస్టర్స్ అన్బరివ్.. రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ తిరిగి స్వాగతం అని ట్వీట్ చేశారు. అయితే, ఈ ప్రాజెక్టులన్నీ కమల్ ఎప్పుడు పూర్తి చేస్తారన్న అంశంపై క్లారిటీ లేదు. కానీ, ఆయన మాత్రం సినిమాల్లో వరుస ప్రాజెక్టులు ప్రకటిస్తూ కుర్ర హీరోలకు గట్టిపోటీ ఇస్తున్నారు. అలాగే, టాలీవుడ్ హీరో ప్రభాస్ నటిస్తున్న 'కల్కి' చిత్రంలోనూ ప్రతి నాయకుడి పాత్రను పోషిస్తున్నారు.

కామెడీ థ్రిల్లర్‌లో ఐశ్వర్య రాజేష్

తమిళ చిత్ర పరిశ్రమలోని యంగ్ హీరోయిన్లలో ఐశ్వర్య రాజేష్ పలు లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. కామెడీ థ్రిల్లర్ మూవీలో నటించేందుకు సమ్మతం తెలిపారు. డెబ్యూ డైరెక్టర్ రా.స వరిముత్తు దర్శకుడు. ఈ సినిమాకు 'సిస్టర్' అనే పేరును ఖరారు చేశారు. యోగిబాబు, రెడిన్ కింగ్‌స్లీ, సునీల్ రెడ్డి, సంతాన భారతి, అర్జునన్ చిదంబరం, శేషు, మారన్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. ఇమ్మాన్ సంగీతం సమకూర్చనున్న ఈ చిత్రానికి కెమెరా తమిళగన్. ఒక ఆస్పత్రిలో నర్సుగా పనిచేసే ఒక మహిళ జీవితంలో జరిగే సంఘటనలు ఆధారంగా కామెడీ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిస్తున్నట్టు దర్శకుడు సవరిముత్తు పేర్కొన్నారు. ద్వారకా ప్రొడక్షన్స్ బ్యానరుపై సినియా రూపుదిద్దుకుంటోంది.



చిత్రజ్యోతి

హీరో ధనుష్‌కు నిర్మాత త్యాగరాజన్ సన్మానం

అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో ధనుష్ హీరోగా నటించిన 'కెప్టెన్ మిల్లర్' సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 12వ తేదీన విడుదలైంది. ఈ సినిమా విడుదలైన ప్రతి చోటా బ్లాక్ బస్టర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. దీంతో హీరో ధనుష్‌ను నిర్మాత టీజీ త్యాగరాజన్ ప్రత్యేకంగా నిలువెత్తు గజమాలతో సన్మానించారు. సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానరుపై నిర్మించిన ఈ చిత్రంలో ధనుష్ సరసన ప్రియాంకా అరుళ్‌మోహన్, నివేదితా సతీష్, జాన్ కొక్కన్, శివరాజ్ కుమార్ తదితరులు నటించారు. శుక్రవారం విడుదలైన నాలుగు చిత్రాల్లో 'కెప్టెన్ మిల్లర్' కలెక్షన్ల పరంగా మొదటి స్థానంలో నిలిచింది. అదేవిధంగా ఈ చిత్రానికి సంగీతం సమకూర్చిన జీవీ ప్రకాష్ కుమార్‌ను కూడా చిత్ర బృంద గజమాలతో సత్కరించింది.

నిలువెత్తు గజమాలతో ధనుష్‌కు సన్మానం





అమెరికా వ్యాపారవేత్తతో అంజలి పెళ్లి?

● క్లారిటీ ఇచ్చిన నటి

తాను అమెరికాకు చెందిన పారిశ్రామికవేత్తను పెళ్లి చేసుకున్నట్టు సోషల్ మీడియాలో సాగుతున్న ప్రచారంపై ఎట్టకేలకు హీరోయిన్ అంజలి స్పందించారు. 'చిత్రపరిశ్రమలో నాకు అనేక మంది స్నేహితులు ఉన్నారు. వారితో నేను మంచి సంబంధాలనే కొనసాగిస్తున్నా. కానీ, కొన్ని వెబ్‌సైట్లు పనిగట్టుకుని తప్పుడు వార్తలు రాస్తున్నాయి. కెరీర్ ఆరంభంలో హీరో జైతో నేను ప్రేమలో ఉన్నట్టు వార్తలు రాశారు. ఇపుడు అమెరికా పారిశ్రామికవేత్తను పెళ్లి చేసుకున్నట్టు ప్రచారం చేస్తున్నారు. నాకు తెలియకుండానే నాకు పెళ్లి చేసేశారు. నటిని కావడంతో ఇష్టాను సారంగా రాసేస్తున్నారు. ఇది మంచిది కాదు. వ్యక్తిగత జీవితాలకు ప్రైవేసి ఇవ్వండి' అని అంజలి కోరారు.





పొంగలి తయారీలో జేఎం నాయుడు, ఎంఎస్ మూర్తి తదితరులు - ముఖ్యఅతిథులు బద్రీనారాయణ, భార్గవిదేవి దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఆంధ్ర కళా స్రవంతి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

ప్యారీస్, జనవరి 14: అచ్చ తెలుగుదనం, నిండుగా, మెండుగా వెల్లివిరిసే సంక్రాంతి పెద్ద పండుగ వాతావరణం స్థానిక కొరట్టూరులోని కోదండ రామాలయ ప్రాంగణంలో దర్శనమిచ్చింది. శ్రీ ఆంధ్ర కళా స్రవంతి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు-2024 నేత్రపర్వంగా సాగాయి. సీతారామ కల్యాణ మండపం ఆవరణాన్ని, రామాలయాన్ని తోరణాలు, విద్యుద్దీపాలు, ముగ్గులతో సుందరంగా అలంకరించారు. ఉదయం 7 గంటలకు రాముడికి అభిషేకాలు నిర్వహించి ముత్తయిదువులు ఆలయ ప్రాంగణంలో వండిన పొంగలిని స్వామివారికి నివేదించారు. ఈ సందర్భంగా రామ భజన, కోలాటం, నృత్య ప్రదర్శనల్లో యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతూ నిర్వహించిన ముగ్గులు, వంటల పోటీల్లో వనితలు పాల్గొని అలరించారు. స్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు సారథ్యంలో నిర్వాహకులు ఎంఎస్ మూర్తి, జె.శ్రీనివాస్, జీవీ రమణ, వీఎస్ హరినాథ్, కేఎస్ సురేష్‌బాబు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించగా, ముఖ్యఅతిథులుగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు జి.బద్రీనారాయణ, భార్గవి దేవి దంపతులు పాల్గొన్నారు. ముందుగా జేఎం నాయుడు ఉపన్యాసంలో... సంస్థ తరపున తెలుగు వారందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.



కోయంబేడులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పొంగల్ సంతను పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

24నుంచి కిళంబాక్కం బస్‌స్టేషన్ నుంచే ఆమ్నీ బస్సు సేవలు

● మంత్రి పీకే శేఖర్‌బాబు

ప్యారీస్, జనవరి 14: నగర శివారు ప్రాంతం కిళంబాక్కం బస్‌స్టేషన్ నుంచి ఆమ్నీ బస్సు సేవలు ఈ నెల 24న ప్రారంభమవుతాయని రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్ ప్రాంగణంలో సంక్రాంతి ప్రత్యేక సంతను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... సంక్రాంతి ప్రత్యేక సంత ఈనెల 17వ తేది వరకు కొనసాగుతుందన్నారు. ఇప్పటివరకు పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి 600లకు పైగా లారీల్లో వచ్చిన డ్రైవర్లు, క్లీనర్లకు సంత ప్రాంగణంలోనే అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించామన్నారు. 25 మంది కార్మికులు పారిశుధ్య పనుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. కిళంబాక్కం బస్‌స్టేషన్‌లో ప్రస్తుతం రెండు క్యాంటీన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, వీటి సంఖ్య పెంచుతామని తెలిపారు. నగరం, శివారు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇక్కడికి సులువుగా వచ్చేలా ఎంటీసీ బస్సులు నడుపుతున్నట్లు మంత్రి శేఖర్‌బాబు తెలిపారు.

ఉత్తర చెన్నైలో సమత్తువ పొంగల్

● పేదలకు సహాయకాల పంపిణీ



పేదలకు నూతన వస్త్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్ ఢిల్లీ బాబు

ప్యారీస్, జనవరి 14: ఉత్తర చెన్నై జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సమత్తువ పొంగల్‌ను వేడుకగా జరుపుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఢిల్లీబాబు నేతృత్వంలో శనివారం కొడుంగైయూర్‌లో జరుపుకున్న వేడుకల్లో తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు కేఎస్ అళగిరి, ఎస్సీ విభాగ అధ్యక్షుడు నిరంజన్‌కుమార్, టీఎన్‌సీసీ సర్వసభ్య కమిటీ సభ్యులు తాళ్లూరి సురేష్, రాష్ట్ర మైనార్టీల కమిషన్ ఛైర్మన్ ఎస్. పీటర్ అల్ఫోన్స్, వేళచ్చేరి ఎమ్మెల్యే హసన్‌మౌలానా తదితరులు పాల్గొని 500 మంది పేదలకు సంక్రాంతి సందర్భంగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.



పొంగలి వండుతున్న మైనార్టీ కమిషన్ ఛైర్మన్ పీటర్ అల్ఫోన్స్ దంపతులు

మదురై మీనాక్షి ఆలయంలో తెప్పోత్సవాలు ప్రారంభం





సర్వాలంకరణతో ప్రత్యేక పీఠంపై ఆశీనులైన ఆదిదంపతులు - ఆలయ ధ్వజస్తంభం వద్ద వేంచేసిన మీనాక్షి, సుందరేశ్వరర్

చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): మదురై మీనాక్షి సుందరేశ్వరర్ ఆలయంలో తై మాస తెప్పోత్సవాలు ధ్వజారోహణంతో ఆదివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు ఈనెల 25 వరకు జరగనున్నాయి. ఈ వేడుకల ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 10.50 గంటలకు మీనాక్షి సుందరేశ్వరర్ సర్వాలంకరణ శోభితులై కొలువుదీరారు. అదే సమయంలో అందంగా అలంకరించిన స్వర్ణ ధ్వజ స్తంభం వద్ద ఆలయ ప్రధానార్చకులు, శైవాగమ పండితులు కలిసి ధ్వజారోహణం నిర్వహించారు. అటు పిమ్మట ప్రత్యేక పూజలు, దీపారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు చెల్లయ్య, ఎం.శీనివాసన్, ఎస్.మీనా, డి.సుబ్బులక్ష్మి సహా వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. సోమవారం నుంచి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్వామి అమ్మవార్లు నాలుగు చిత్తిరై వీధుల్లో వివిధ రకాల వాహనాలపై ఆశీనులై విహరించనున్నారు. ఈ వేడుకల్లో అత్యంత కీలకఘట్టం ఈనెల 25 వేకువజాము మీనాక్షి, సుందరేశ్వరర్ పంచమూర్తుల సమేతంగా బయలుదేరి మండియూరు మారియమ్మన్ తీర్థకొలనులో తెప్పోత్సవంలో పాల్గొంటారు. ఈ వేడుకలకుగాను ఆలయ అధికారులు, పోలీసులు, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి భక్తులకు తగు వసతులు కల్పించనున్నారు.

9 నుంచి అయోధ్యకు విమాన సేవలు

పెరంబూర్, జనవరి 14: అయోధ్య రామాలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం చెన్నై నుంచి అయోధ్యకు ఫిబ్రవరి 9 నుంచి నేరుగా విమాన సేవలు ప్రారంభం కానున్నాయి. చెన్నై స్వదేశీ విమానాశ్రయంలోని 1వ టెర్మినల్ నుంచి ఫిబ్రవరి 9వ తేది నుంచి 'స్పైస్ జెట్' విమాన సంస్థ ఈ సేవలు అందించనుంది. చెన్నై నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరే విమానం 3.15 గంటలకు అయోధ్య చేరుకుంటుంది. అయోధ్యలో సాయంత్రం 4 గంటలకు బయల్దేరి 6.20 గంటలకు చెన్నై చేరుకుంటుంది. 180 మంది ప్రయాణించే వీలున్న ఈ విమానంలో ఒకరికి ఛార్జీగా రూ.6,499గా నిర్ణయించినట్లు సంస్థ ప్రకటించింది.



డాక్టర్లు కర్రా గురునాథ్, రమణరాజ్, మురుగేశన్ తదితరులు

ఎంఎంసీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

ప్యారీస్, జనవరి 14: మద్రాసు మెడికల్ కాలేజీ 1963వ బ్యాచ్‌కు విద్యార్థుల ఆత్మీయ సమావేశం ప్రముఖ పర్యాటక ప్రాంతం మహాబలిపురంలో ఆదివారం సందడిగా జరిగింది. తెలుగు ప్రముఖుడు డాక్టర్ కర్రా గురునాథ్ కృషితో ఎంఎంసీలో 1963వ సంవత్సరం ఎంబీబీఎస్ పూర్తిచేసిన వైద్యులు సుమారు 25 మంది పాల్గొని తమ పాత స్మృతులు గుర్తు చేసుకున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆధ్వర్యంలోని ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులుగా పని చేసిన రోజుల్లో రోగులకు అందించిన సేవలు, వారికి సహకరించిన సహ వైద్యులు, నర్సులు, ఆసుపత్రి సిబ్బందిలో కొంతమందిని ఆహ్వానించి సంక్రాంతి సందర్భంగా సత్కరించి బహుమతులు పంపిణీ చేశారు.

మేఘమలైలో అరుదైన సీతాకోకచిలుకలు



ప్యారీస్, జనవరి 14: శ్రీవిల్లిపుత్తూరు పడమటి కనుమలు అధికంగా ఉన్న మేఘమలై ప్రాంతం 'క్లౌడ్ ఫారెస్ట్ సిల్వర్ లైన్' అనే కొత్త సంతతికి చెందిన అరుదైన సీతాకోక చిలుకలు విహరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. మేఘమలై పులుల అభయారణ్య ప్రాంతంలో 33 యేళ్ల అనంతరం ఈ కొత్త రకానికి చెందిన సీతాకోక చిలుకలను గుర్తించినట్లు తెలిపారు. తేనికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ ఇటీవల నిర్వహించిన పరిశోధనలో ఈ సీతాకోక చిలుకల సంచారం వెల్లడైనట్లు తెలిపారు. మొత్తం 337 సంతతికి చెందిన సీతాకోక చిలుకలు ప్రపంచవ్యాప్తంగా సంచరిస్తున్నాయని, వీటిలో 40 రకాలకు చెందిన సీతాకోక చిలుకలు మేఘమలై ప్రాంతంలో చల్లటి వాతావరణంలో విహరిస్తున్నట్లు పేర్కొన్నారు. మేఘమలై ప్రాంతం సీతాకోక చిలుకల సంచారని అనువైన ప్రాంతంగా ఉంటోందని తెలిపారు.

కర్షకజీవుల కష్టనష్టాలకు అద్దంపట్టే 'మట్టిబండి'

● విశ్రాంత అధ్యాపకురాలు కమలాకర రాజేశ్వరి



చెన్నై, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, పరిశోధకుడు, బాలసాహిత్యకారుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ రచించిన దీర్ఘకవిత 'మట్టిబండి' కర్షక జీవుల కష్టనష్టాలకు అద్దం పట్టే రీతిలో ఉందని విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు కమలాకర రాజేశ్వరి పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి తన 44వ నెట్ ఇంటి నెలనెలా వెన్నెల కార్యక్రమంగా 'మట్టిబండి - రచనా వైశిష్ట్యం' అనే అంశంపై ప్రసంగించారు. 'మట్టిబండి' అనేది 42 పేజీల దీర్ఘకవిత అని, ఇందులో పాత్రలకు పేర్లు లేవని, అయినా ఆయా పాత్రలు తమ మనోభావాలను పంచుకుంటాయన్నారు. రైతులకు తాతల కాలం నాటి భూమితో, తాతలతో ఉన్నటువంటి అనుబంధం, తన పిల్లలతోపాటు ఎదిగే ఎడ్లతో పిల్లలతో విడదీయరాని అనుబంధం ఉంటాయాని కవి కళ్లకు కట్టినట్లు వివరించాని ఆమె పేర్కొన్నారు. రైతు కుటుంబానికి చెందిన అబ్బాయిలను పెళ్లి చేసుకోవాలని పల్లెపడుచులు ఇష్టపడకపోవడం, వ్యవసాయంలో అప్పులే కాని లాభాలు ఎక్కువగా ఉండకపోవడం, గతిలేని పరిస్థితులలో సొంత ఊళ్లలోని పొలం, ఎద్దులు, బండి అమ్ముకొని పట్నానికి తరలివెళ్ళడం వంటి సామాజిక అంశాల చుట్టూ ఇతివృత్తం ఉంటుందని, ఈ 'మట్టిబండి' అన్నదాతకు ప్రతీక అని వివరించారు. వస్తువు, భావజాలం రెండూ పడుగుపేకల్లా అల్లుకుపోయినటువంటి ఉదాత్త రచనగా 'మట్టిబండి' కనిపిస్తుందన్నారు. ఇందులో కవితార్తి సరస్వతి స్రవంతిలాగా గోచరిస్తుందని కమలాకర రాజేశ్వరి కొనియాడారు. ఒక సందర్భంలో పింగళి సూరన 'కళాపూర్ణోదయం' రచనను గుర్తు తెచ్చేలా ఈ దీర్ఘకవిత ఉందని అభిప్రాయపడ్డారు. ఆ కథను క్లుప్తంగా చెప్పారు. ఈ కార్యక్రమానికి ముందు ప్రార్థన చేసి వీక్షకులకు ఆహ్వానం పలికిన ప్రముఖ గాయని నిడమర్తి వసుంధర వక్తి గురించి పరిచయం చేస్తూ ఆమె తెలుగు అధ్యాపకురాలిగా పదవీ విరమణ చేశారని, 'తెలుగు భారతి' ద్వారా అనేక పాఠ్య పుస్తకాలను రచించి సంపాదకత్వం వహించారని, వాటిని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వెలువరించిందని తెలిపారు. నేషనల్ బుక్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియా ద్వారా అనేక అనువాద రచనలు కూడా చేశారని, ప్రస్తుతం ఓ తెలుగు దిన పత్రిక విలేఖరిగాను పని చేస్తున్నారని పేర్కొన్నారు.



అన్నదానం మహోన్నతమైన సేవ

● గోపురం కుంకుమం అధినేత వైవీ హరికృష్ణ

ప్యారీస్, జనవరి 14: అన్నదానం మహోన్నతమైన సేవ అని గోపురం కుంకుమం తయారీ సంస్థ అధినేత, అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వైవీ హరికృష్ణ అన్నారు. ఈనెల 22న అయోధ్యలో రామ మందిరం ప్రాణప్రతిష్ఠ ప్రారంభం కానున్న సందర్భంగా చెన్నైలోని ఎస్వీఏసీ ఫౌండేషన్ నెలరోజుల పాటు ఆలయాన్ని సందర్శించే భక్తులకు అన్నదానం నిర్వహించనుంది. ఈ క్రమంలో అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానికి విరాళంగా రూ.1.25 లక్షలను వైవీ హరికృష్ణ ఎస్వీఏసీ ఫౌండేషన్ టీంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కాశీ విశ్వనాథన్, కార్యదర్శి ప్రసాదరావు, కోశాధికారి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అన్నదాన పథకానికి ఎస్వీఏసీ ఫౌండేషన్ నిర్వాహకులకు విరాళంగా రూ.1.25 లక్షలు అందిస్తున్న వైవీ హరికృష్ణ



రాజ్‌భవన్ ఉద్యోగుల కుటుంబసభ్యుల కోసం నిర్వహించిన పొంగల్ వేడుకల్లో పొంగలి పెడుతున్న గవర్నర్ ఆర్ఎన్ రవి, సతీమణి లక్ష్మీరవి